# వానకాలం సాగుకు సిద్ధం

- వర్షాల్లేక అన్నదాత అయోమయం
- రైతు భరోసా రాక అప్పుల బాట
- వరి, మొక్కజొన్న, పత్తి విత్తనాలు పెడుతున్న రైతులు

వరి నాట్లు వేసేందుకు బురదలో దున్నకాలు చేపడుతున్న రైతాంగం

వరి నాట్లకోసం ముందుగానే వరి తుకాలు వేసుకున్న రైతులు

రామాయంపేట, జూలై 14: రామాయంపేట మండల వ్యాప్తంగా రైతన్నలు వానకాలం దున్నకాలు దున్నుతున్నారు. పంటలు వేద్దామంటే సరైన సమయంలో వర్షాలు కురవడం లేదు. దీంతో రైతన్న ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. ప్రభుత్వం రైతు భరోసా వేయకపోవడంతో రైతులు అప్పుల బాట పడుతున్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు జూన్ మొదటి వారంలోనే రైతుబంధు డబ్బులిచ్చేవారు. రైతు భరోసా వస్తుందా లేదా అనే అయోమయంలో ఉన్నారు. బోరు బావు వద్ద వరి, మొక్కజొన్న, పత్తి విత్తనాలు విత్తుతున్నారు. కొంతమంది ముందుగానే తుకాలు వేశారు. వాళ్లు ఇప్పుడు నాట్లు వేసుకుంటున్నారు.

### రైతుభరోసా రాక ఇబ్బందులు

వానకాలం వచ్చి రెండు నెలలు గడుస్తున్నా పంటలు వేసుకుందామంటే ఒకపక్క వర్షాల్లేవు. ప్రభుత్వం ఇంతవరకు రైతు భరోసా డబ్బులు వేయలేదు. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతన్నాం. బయట నుంచి అప్పులు తీసుకొచ్చి పంటలు సాగుచేయాల్సిన పరిస్థితి ఎదురవుతున్నది. – నర్సింహులు, రైతు, ఆర్.వెంకటాపూర్

### బోరుబావుల్లో సమృద్ధిగా నీళ్లు

మాకు యాసంగిలో, ఇప్పుడు నీళ్లకు ఇబ్బందులు లేవు. బోరుబావుల్లో నీళ్లు సమృద్ధిగా ఉన్నాయి. మా భూమిలో వరి నాటుకుంటున్నం. మూడెకరాల్లో వరి మడులు సిద్ధం చేశాం. వారం పదిహేను రోజుల్లో నాట్లు వేస్తాం. ఇప్పుడైనా ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వాలి.

– మాసుల యాదగిరి, రైతు, రామాయంపేట

## లక్ష గాజులతో దుర్గామాత దర్శనం

లక్ష గాజులతో వనదుర్గామాత

పాపన్నపేట, జూలై 14: ఆషాఢమాస ఆదివారాన్ని పురస్కరించుకుని ఏడుపాయల వన దుర్గాభవానీ మాతను లక్ష గాజులతో అలంకరించారు. చుట్టుపక్కల రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ చైర్మన్ బాలగౌడ్, ఈవో కృష్ణ ప్రసాద్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. వేదపండితులు శంకరశర్మ, పార్థివశర్మ, మురళీధర్, రాజశేఖర్ పూజలు చేశారు. పాపన్నపేట్ ఎస్సై నరేశ్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

## భక్తిశ్రద్ధలతో మెదక్ చర్చిలో ప్రార్థనలు

దైవ సందేశమిస్తున్న రాంకోటి చర్చి ఇన్‌చార్జి రెవరెండ్ భాస్కర్, పాల్గొన్న భక్తులు

మెదక్ మున్సిపాలిటీ, జూలై 14: రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు, పర్యాటకులు తరలిరావడంతో ఆదివారం మెదక్ చర్చి కిక్కిరిసిపోయింది. ప్రత్యేక ప్రార్థనల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ ప్రార్థనల్లో హైదరాబాద్‌లోని రాంకోటి చర్చి ఇన్‌చార్జి రెవరెండ్ భాస్కర్ భక్తులనుద్దేశించి దైవ సందేశం వినిపించారు. ప్రార్థనల్లో చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య, చర్చి పాస్టర్లు శ్రీనివాస్, జైపాల్, డేవిడ్, చర్చి కమిటీ సభ్యులు సంపత్, జాన్సన్, నోబుల్ సన్, జాయ్‌ముర్రే పాల్గొన్నారు.

## అదానీతో జరిగిన చీకటి ఒప్పందం బయటపెట్టాలి

నర్సాపూర్, జూలై 14: ప్రభుత్వానికి, అదానీకి మధ్య జరిగిన చీకటి ఒప్పందాన్ని బయటపెట్టాలని టీఎస్ యూఈఈయూ (తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్) సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏ.మహేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని రెడ్డిపల్లి గ్రామ సబ్‌స్టేషన్‌లో టీఎస్ యూఈఈయూ సీఐటీయూ మెదక్ డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్క సర్కిల్, ఫీడర్ కంపెనీలను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వవద్దని డిమాండ్ చేశారు. ఇప్పటికే సౌత్ సర్కిల్లో అదానీ గ్రూప్ సర్వేలు చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం చాప కింద నీరులాగా ఆ సంస్థతో ఒప్పందం చేసుకున్నదని ఆరోపించారు. జిల్లాలో ఆర్టిజెన్స్ అధికారుల వేధింపులు ఆపాలని, అన్ని సబ్‌స్టేషన్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రవీంద్రప్రసాద్, నర్సింహులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, సభ్యులు సురేశ్, శ్రీను, నాగరాజు, మల్లేశ్, రాములు, నరేశ్, భాస్కర్ పాల్గొన్నారు.

## లింగోజీ తండాలో తాగునీటి కటకట

బోరు నీరు పట్టుకుంటున్న తండావాసులు

శివ్వంపేట, జులై 14 : మండలంలోని లింగోజిగూడ తండాలో తాగునీరు రాక ఇబ్బందు లు పడుతున్నట్లు మహిళలు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ వారం రోజులు గా తాగునీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. పంట పొలాల నుంచి నీరు తెచ్చుకుంటున్నామన్నారు. తండాలో సింగల్‌ఫేజ్ మోటరు తీసుకెళ్లి లింగోజిగూడలో బిగించారన్నారు. పంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు విన్నవించినా స్పందించడం లేదన్నారు. తండాలో ఉన్న ట్యాంకులోకి మిషన్ భగీరథ నీరు రావడం లేదని, సమస్య పరిష్కరించకుంటే ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.

## బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ అండ

చేగుంట, జూలై 14: నార్సింగి మండలంలోని భీంరావ్‌పల్లికి చెందిన పులగాళ్ల బాలకృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి 50 కిలోల బియ్యం, ఆర్థిక సాయాన్ని మాజీ జడ్పీటీసీ బాణపురం కృష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మైలరాం బాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు బోయిని శ్రీశైలం, దాసు, భిక్షపతి, ప్రవీణ్, గోవర్ధన్, బాబు, నర్సింహులు, అశోక్, సునీల్, విజయ్ అందించారు.

## రైతులను భయభ్రాంతులకు గురిచేయొద్దు

రైతులకు మద్దతు తెలుపుతున్న సీపీఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి నాగరాజు

నర్సాపూర్, జూలై 14: గ్రామాల్లో సభలు పెట్టకుండా అధికారులు భూములు సర్వే చేస్తూ రైతులను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని సీపీఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు పేర్కొన్నారు. కొండపోచమ్మ సాగర్ నుంచి సంగారెడ్డి వరకు నిర్మిస్తున్న కెనాల్‌కు భూములు కోల్పోతున్న రైతులు చేపట్టిన రిలే నిరాహారదీక్ష ఆదివారం మూడో రోజుకు చేరుకున్నది. రైతులకు సంఘీభావం తెలిపి రిలే నిరాహారదీక్షకు సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మహేశ్, జైరాంనాయక్, శ్రీనివాస్ నాయక్, తరుణ్, రవి, రాజు, విఠల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నిజాంపేట, జూలై 14: నిజాంపేటలోని రేణుక ఫంక్షన్ హాల్‌లో స్థానిక ఉన్నత పాఠశాలలో 1992 –93 పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు బాలయ్య, జనార్దన్‌రెడ్డి, రాజిరెడ్డి, మల్లయ్య, సత్యనందం, పూర్వ విద్యార్థులు నరేందర్, ప్రశాంత్‌రెడ్డి, ఇక్బాల్, అనిల్, నరేశ్, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

# ఇతర రాష్ట్రాల కూలీల వ్యవసాయం

- నాట్లు మొదలు హమాలీ వరకు..
- రోజుకు పది ఎకరాల వరకు నాట్లు
- ఒక్కొక్కరికి రోజుకు వెయ్యి కూలీ

చేగుంట మండలం కర్నాల్‌పల్లిలో వరి నారు మడిలో నారు తీస్తున్న కోల్‌కత్తా కూలీలు

చేగుంట మండలం కర్నాల్‌పల్లిలో వరి నాటేస్తున్న కలకత్తా కూలీలు

చేగుంట, జూలై 14: రాష్ట్రంలో సాగు విస్తీరం పెరగడంతో ఇతర రాష్ట్రాల కూలీలకు ఇక్కడ ఉపాధి దొరుకుతున్నది. నాట్ల నుంచి పంట పూర్తయ్యే వరకు పని దొరకడంతో ఇతర రాష్ట్రాల కూలీలు వలసలస్తున్నారు. కేసీఆర్ ముందు చూపుతో సాగు పెరిగి తెలంగాణలో ఏడాది పాటు ఉపాధి దొరుకుతున్నది. నాటు మొదలు పంట చెళ్ల నుంచి రైస్‌మిల్‌లో బియ్యం తయారీ వరకు ఉపాధి పొందుతున్నారు. ఎకరా నాటేస్తే రూ.4500 నుంచి 5వేల వరకు కూలీలకు చెల్లిస్తున్నారు. ఇలా రోజుకు 7 నుంచి 8 ఎకరాల వరకు వీరు నాటేస్తున్నారు. దీంతో ఒక్కొక్కరికి రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు కూలీ పడుతున్నది.

### మూడేండ్ల నుంచి ఇక్కడే..

మూడేండ్ల నుంచి వానకాలం, యాసంగి రెండు సీజన్లలో ఉపాధి దొరుకుతున్నది. మా ప్రాంతంలో కూలి తక్కువ. ఇక్కడ కూలి రోజుకు వెయ్యి వరకు దొరుకుతున్నది. తెలంగాణలో పనిచేయడం సంతోషంగా ఉంది. – బిజ సర్కర్, కూలీ, కోల్‌కతా

### ఒకే రోజులో 10 ఎకరాల నాటు

ఒకే రోజులో 10 ఎకరాల వరకు నాటు పూర్తి చేస్తున్నారు. నారు మడి నుంచి తూకం తీయడంతో పాటు, మందు, నాటేయడం చేస్తున్నారు. మగ కూలీలు వేసే నాటులో విత్తనాలు ఆదా అవుతున్నాయి. ఎకరా ఐదు బస్తాల విత్తనాలు అదనంగా పంట దిగుబడి వస్తున్నది. – రాంచంద్రరెడ్డి, రైతు కర్నాల్‌పల్లి, చేగుంట

# వైభవంగా అమ్మవార్లకు ఆషాఢం బోనాలు

వెల్దుర్తి: శాకాంబరీగా దర్శనమిచ్చిన రాజరాజేశ్వరీ



చిలిపిచెడ్: చాముండేశ్వరీ ఆలయంలో భక్తులు

మెదక్‌రూరల్: ప్రత్యేక అలంకరణలో రేణుకామాత

చిలిపిచెడ్, జూలై 14: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని అంతారం గ్రామంలో నల్లపోచమ్మకు ఆదివారం బోనాలు సమర్పించారు. డప్పు చప్పులతో, పోతరాజుల విన్యాసాలతో, శివసత్తుల పూనకాలతో గ్రామంలో ప్రధాన వీధుల గుండా బోనాలు ఊరేగించారు.

**శాకాంబరీగా రాజరాజేశ్వరీదేవీగా**

వెల్దుర్తి, జూలై 14: వెల్దుర్తిలోని రాజరాజేశ్వరీ దేవాలయంలో మహిళలు దేవిని పంచామృతాలతో ఆదివారం అభిషేకాలు నిర్వహించారు. శాకాంబరీ దేవీగా అలంకరించి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన చేశారు. ఆలయ ప్రాంగణంలో శక్తిశ్రద్ధలతో దేవీ పారాయణం పఠించారు.

**చాముండేశ్వరీ ఆలయంలో భక్తుల రద్దీ**

చిలిపిచెడ్, జూలై 14: ఆషాఢ మాసం కావడంతో చిట్కుల్ గ్రామ శివారులోని చాముండేశ్వరీ ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సమీపంలోని మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి కుంకుమార్చనలు, ఒడిబియ్యం సమర్పించారు. ప్రధాన పూజారి ప్రభాకర్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

**రేణుకా మాతకు ప్రత్యేక పూజలు**

మెదక్‌రూరల్, జూలై 14: మండలంలోని మంబోజిపల్లి శివారు మల్లన్న అలయంలోని రేణుకామాతకు ఆషాఢమాసం బోనాలను పూజరి మల్లన్న ఆధ్వర్యంలో సమర్పించారు. ఎల్లమ్మతల్లికి పట్నం వేశారు. అనంతరం అన్నదానం చేశారు.

**ఘనంగా పోచమ్మ బోనాలు**

రామాయంపేట, జూలై 14: డీ.ధర్మారంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో శివసత్తుల నృత్యాలు, ఆటపాటలు ఆకట్టుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పూజల్లో పాల్గొన్నారు.

చిలిపిచెడ్: అంతారంలో ఆషాఢం మాసం బోనాలు సమర్పిస్తున్న గ్రామస్తులు

రామాయంపేట: డీ.ధర్మారం గ్రామంలో బోనాల ఊరేగింపు

## చాకలి ఐలమ్మ విగ్రహానికి రూ. 20వేల విరాళం

కార్మికులకు నిత్యావసరాలు అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ మహేశ్‌గుప్తా

శివ్వంపేట, జులై 14 : శివ్వంపేట మండలం కొత్తపేట గ్రామంలో ఏర్పాటు చేస్తున్న వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయుటకు తాజా మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా రూ. 20వేల విరాళాన్ని విగ్రహ కమిటి సభ్యులకు అందజేశారు. తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ లాంటి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

**కార్మికుల పెండింగ్ వేతనాల చెల్లించాలి**

పంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు నెలల వేతనాలు చెల్లించాలని మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా అన్నారు. పంచాయతీ కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సొంత ఖర్చులతో నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పద్మావెంకటేశ్, గ్రామకమిటీ అధ్యక్షులు శేఖర్‌గౌడ్, లక్ష్మీనర్సయ్య, చాకలి ప్రభుదాస్, చాకలి నర్సింలు, చాకలి మురళీదాస్, చాకలి మల్లేశ్, చాకలి సాదుల్, వంజరి కొండల్, పోచాగౌడ్, సింహం, లక్ష్మీనారాయణ, వెంకటేశ్, కృష్ణ, రామాగౌడ్, త్రినేశ్ పాల్గొన్నారు.

## నందిగామలో సామాజిక తనిఖీ బృందం పర్యటన

నందిగామ నర్సరీని పరిశీలిస్తున్న ఉపాధి హామీ సామాజిక తనిఖీ బృందం సభ్యులు

నిజాంపేట, జూలై 14: మండలంలోని నందిగామలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఆదివారం పర్యటించినట్లు కార్యదర్శి ఆరిఫ్ హుస్సేన్ తెలిపారు. గ్రామంలోని నర్సరీ, ఉపాధి పనులు, డ్రాగన్ ఫ్రూట్ సాగు, ప్లాంటేషన్, సీసీ రోడ్ల పనులను బృందం పరిశీలించింది. టెక్నికల్ అసిస్టెంట్ శశిరేఖ, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రేమలత ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

క్షతగాత్రుడు బాబురావు

రామాయంపేట, జూలై 14: రోడ్డు ప్రమాదం లో మహిళ మృతి చెందింది. వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన రామాయంపేట పోలీస్ స్టేష న్ పరిధిలోని జాతీయ రహదారి వద్ద ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలానికి చెందిన రంగమ్మ(70), ఆమె కుమారుడు కలిసి బైక్‌పై మెదక్ మీదు గా రామాయంపేటకు వస్తున్నారు. మార్గ మధ్యలో రామాయంపేటలోని కేసీఆర్ కాలనీ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తల్లి అక్కడికక్కడే మృతి చెందింది. కుమారుడు బాబురావుకు తీవ్రగాయాలయ్యాయి. 108 అంబులెన్సులో ఇద్దరిని రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుమారుడు చికిత్స పొందుతున్నాడు. రామాయంపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

రామాయంపేట, జూలై 14: చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన అక్కన్నపేటలో ఆదివారం జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాపయ్యగారి సత్యనారాయణ తన బైక్‌పై శనివారం రాత్రి వ్యవసాయ బావి వద్దకు వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. వెంటనే కుటుంబీకులు రామాయంపేట ప్రభుత్వ దవాఖాన, హైదరాబాద్‌లోని ప్రైవేటు దవాఖానకు తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రామాయంపేట పోలీసులు పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఫైజాబాద్‌లో అర్ధరాత్రి దొంగలు బీభత్సం

చిలిపిచెడ్, జూలై 14: అర్ధరాత్రి తాళం వేసిన ఇండ్లలో దొంగలు బీభత్సం సృష్టించిన ఘటన మండలంలోని ఫైజాబాద్ గ్రామంలో ఆ దివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం.. ఫైజాబాద్‌కు చెందిన తాళ్ల కృష్ణ దంపతులు బంధువుల దగ్గరికి వెళ్లారు. దొండగులు వారి ఇంటి తాళం పగలగొట్టి బీరులోంచి 23 తులాల వెండి గొలుసులు, రూ.19వేలు, 150 కిలోల బి య్యం దొంగలించారు. తాళ్ల బాలమల్లయ్య ఇంట్లో ప్రయత్నం చేయగా పక్కటి ఇంటి వారు శబ్దం చేయడంతో పరారయ్యారు. కటి కే యాదుల్లాకు చెందిన ఐదు గొర్రెలు ఎత్తుకెళ్లారు. పరిసరాలను పరిశీలించిన ఎస్సై దొంగలను త్వరలో పట్టుకుంటామన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ మహబూబ్ తెలిపారు.

### సేవాలాల్ గుడిని దర్శించుకున్న మైనంపల్లి

రామాయంపేట, జూలై 14: రామాయంపేట పురపాలికలోని గిరిజన తండాలో సేవాలాల్ గుడిని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు దర్శించుకున్నారు.

## ఈ బైకు ఎవరిది?

పాపన్నపేట, జూలై 14: ఏడుపాయల్లో ఎండోమెంట్ కార్యాలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు బైకు వదిలివెళ్లారు. వారం రోజులుగా కార్యాలయం పక్కనే బైకు ఉన్నా సిబ్బంది పట్టించుకోలేదు. మంజీరా నదిలో ఏటా పదుల సంఖ్యలో భక్తులు మృతి చెందుతుంటారు. ఏపీ28 బీఎఫ్ 2491 నంబర్ గల హీరో హోండా బైకును పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి విచారించాలని భక్తులు కోరుతున్నారు.

### కిరాణా దుకాణంలో చోరీకి యత్నం

నర్సాపూర్, జూలై 14: కిరాణా దుకాణంలో దుండగులు చోరీకి యత్నించిన ఘటన బ్రాహ్మణపల్లిలో శనివారం రాత్రి జరిగింది. బ్రాహ్మణపల్లికి చెందిన ఆంజనేయులు కిరాణా దుకాణం నడిపిస్తూ ఉపాధి పొందుతున్నాడు. రోజు మాదిరిగానే శనివారం రాత్రి దుకాణం బంద్ చేసి, వెళ్లాడు. దుండగులు దుకాణం షెట్టర్ తాళం పగలగొట్టడానికి విఫలయత్నం చేశారు. తాళం ఎంతకీ రాకపోవడంతో పైన ఉన్న సిమెంట్ రేకుకు బండరాయితో కన్నం వేసి చోరీకి యత్నించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు.

### ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

రామాయంపేట, జూలై 14: ప్రమాదాల నివారణకు లయన్సు క్లబ్ కృషి చేస్తున్నదని లయన్స్ రాష్ట్ర గవర్నర్ నగేశ్ వెంపాటి పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని లయన్స్ క్లబ్ భవనంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ సమావేశంలో లయన్ అంతర్జాతీయ జిల్లా కార్యదర్శిగా మెదక్ జిల్లాకు చెందిన లయన్ రాజశేఖర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అనంతరం గోడపత్రికను ఆవిష్కరించారు.

### టీచర్లను వెంటనే రిలీవ్ చేయాలి

మెదక్ మున్సిపాలిటీ/చిన్నశంకరంపేట, జూలై 14: బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియెట్ అధ్యక్షుడు మల్లారెడ్డి , ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య ఆదివారం డిమాండ్ చేశారు. పాఠశాలల్లోని సమస్యలపై దృష్టిసారించాలన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WATER PROOFING

★ Roof & Wall Crack Filling, Water Proofing Coatings, New & Old Bhathrooms Leakages, Water Tank & Sump Leakages, Rain Coat & Pest Control, Slab & Beems Injection Work, 10 years Waranty. Call: 9010425273, 8121425273.
NT-326124

PLOT FOR SALE

★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్, SBI దగ్గర 161 చ.గ. ఇంటి స్థలం అమ్మబడును. వివరాలకు సంప్ర: 8143366630 / 9989554915.
NT-325881

TOURS & TRAVELS

★మహాదేవ టూర్స్: 6th నవంబర్-కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578.
NT-339536-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.